క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపు

బల్లికురవ: ఆధార్‌కార్డుల ప్రాముఖ్యతను గుర్తించి మండలంలోని కొమ్మినేనివారి పాలెం , వైదన గ్రామాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. కుసుమకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళవారాల్లో కొమ్మినేనివారిపాలెం సచివాలయంలో బుధ, గురు, శుక్రవారాల్లో వైదన సచివాలయాల్లో క్యాంపులు ఏర్పాటు చేసినటట్లు చెప్పారు. ఆధార్ కార్డు లేని చిన్నారులు వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

18 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల అర్బన్: చైతన్య భారతి ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు సంగీత సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలను ముంతావారి సెంటర్‌లోని ఎన్‌వీఎస్‌అండ్‌ఎస్‌జీఆర్ కల్యాణ మండపంలోని పైభాగంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణమూర్తిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు రాత్రి వివిధ ప్రాంతాల్లోని సంగీత విద్వాంసులచే గాత్ర కచ్చేరి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు అందరూ విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

9 నుంచి కేవీ పాలెంలో క్రికెట్ పోటీలు

బల్లికురవ: నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో ఈనెల 9 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 25,116, రెండో బహుమతిగా రూ. 20,116, మూడో బహుమతిగా 15,116 మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌కు రూ. 3,116 అందజేయనున్నట్లు చెప్పారు. 8వ తేదీలోపు ఎంట్రీలు పంపాలని మరిన్ని వివరాలకు 85558 34197 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



వేటపాలెం: అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. బైపాస్ రోడ్డులో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. అక్కడి నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను ఆపగా సరైన అనుమతి పత్రాలు లేక పోవడంతో పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

12 మంది జూదరుల అరెస్టు

చీరాల: వేటపాలెం మండలం రామాపురం పరిసరాలలో పేకాట ఆడుతున్న జూదరలను అదుపులోకి తీసుకున్నట్లు ఈపూరుపాలెం రూరల్ ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. రామాపురం ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి రూ.8350 నగదు సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

కరెంటు చార్జీలు పెంపునకు నిరసనగా కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో పర్చూరులో ఆదివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదానీ చేసిన చర్యలకు ప్రజలను శిక్షిస్తారా అంటూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో కరపత్రాలను పంపిణీ చేసి నినాదాలు చేశారు. పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మజుందార్, మత్తె డేవిడ్, బండారు చిన్నదాసు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి భావనారుషి బ్రహ్మోత్సవాలు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనారుషి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉడతా భాస్కర పార్వతీశ్వరరావు, జి.వెంకటసుబ్బారావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, నగరోత్సవం, పొన్నమాను ఉత్సవం, కల్యాణోత్సవం, రథోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

సామాజిక సేవలోనే ఆనందం

- సేవా కార్యక్రమాల్లో కక్కెర ఫౌండేషన్
- జన్మనిచ్చిన గ్రామంపై మమకారంతో రూ.30 లక్షలతో రామాలయ నిర్మాణం
- రూ.3 కోట్లతో కల్యాణ మండపం ఏర్పాటు
- వైద్యశిబిరాల ఏర్పాటుతో రోగులకు సేవలు



సోలార్ సిస్టం



ఆర్వో ప్లాంట్

బల్లికురవ:

పుట్టిన ఊరికి ఎంతోకొంత సేవ చేయాలనే కోరిక. ఊరు మనకు ఎంతో ఇచ్చింది. మనం తిరిగి ఇచ్చేయాలన్న మాటలు ఫౌండేషన్ ఆచరిస్తోంది. జన్మనిచ్చిన గ్రామంపై మమకారంతో మాజీ గ్రామాధికారి కుమారుడు రెండు దశాబ్దాలుగా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బల్లికురవ గ్రామ పంచాయతీలోని కొండాయపాలెం మాజీ గ్రామాధికారి దివంగత కక్కెర వెంకట సుబ్బారావు కుమారుడు ఆంజనేయులు వ్యాపారరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. గ్రామంపై ఉన్న అభిమానంతో గ్రామ కూడలిలో జీర్ణావస్థతో కూలే దశలో ఉన్న రామాలయాన్ని పునః నిర్మించాలని 2006లో సంకల్పించారు. స్థల సేకరణతో సుమారు రూ.30 లక్షలతో హనుమత్ సమేత సీతా లక్ష్మణ కోదండ రామస్వామి ఆలయాన్ని నిర్మించి 2008లో ప్రతిష్ఠ మహోత్సవాలు పూర్తి చేశారు. ఆలయానికి సమీపంలోనే అర్చకుడు వినుకొండ మారుతి నరేష్‌కు పూర్తి వసతులతో పక్కా భవనం నిర్మించి నెలనెలా జీతానికి కొంత సొమ్ము ఏర్పాటు చేశారు. ఆలయానికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల భక్తుల ఆదరణ పెరిగింది.

కల్యాణ మండపం ఏర్పాటు..

కుమారుడో, కుమార్తెకో వివాహం చేయాలంటే తల్లిదండ్రులకు గ్రామాల్లో వసతులు లేక పట్టణాలకు వెళ్లటం, హైరానా పడటం ఆంజనేయులు గ్రహించారు. రామాలయానికి పడమర భాగంలో స్థలాన్ని సమకూర్చుకుని పూర్తి వసతులతో ఒకేసారి రెండు శుభకార్యాలు చేసుకునేలా రెండంతస్తుల మండపాన్ని నిర్మించారు. 2020లో అప్పటి సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి, జాస్తి చలమేశ్వర్ చేతుల మీదుగా కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.

మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు గత నాలుగు సంవత్సరాలుగా వివాహాలు, చిన్నారుల పుట్టినరోజు వేడుకలు, అన్నప్రాసనలు, వివాహ నిశ్చయ తాంబూలాలు ఇతర వేడుకలు నిర్వహించుకుంటున్నారు. ఈమండపంలో శుభకార్యాలు నిర్వహించే వారి నుంచి నిర్వాహకులు సొమ్ము ఆశించడం లేదు.



కొండాయపాలెంలో నిర్మించిన రామాలయం

ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా మంచినీరు..

ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చెన్నుపల్లి రక్షిత పథకం ద్వారా కొండాయపాలెం గ్రామానికి ఓవర్ హెడ్ ట్యాంకు ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపాలతో గత పదేళ్లుగా ఏనాడూ చుక్కనీరు అందిన దాఖలాలు లేవు. గ్రామస్తులకు సురక్షిత మంచినీరు అందించాలని మండపం పైభాగంలో గంటకు 2000 లీటర్ల నీటిని సరఫరా చేసే ఆటోమేటిక్ ఆర్వో సిస్టం ఏర్పాటు చేశారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన కుళాయి ద్వారా ఈ సురక్షిత నీటిని ఇంటింటికి తీసుకెళ్తున్నారు. మండపంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు.

షుగర్ రోగులకు వైద్యశిబిరాలు ఏర్పాటు..

ఈ ప్రాంతంలో షుగర్ రోగులు ఎక్కువగా ఉన్నారు. పరీక్షలు నిమిత్తం ప్రతిరోజు పట్టణాలకు వెళ్లాల్సి రావటంతో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షుగర్ పరీక్ష చేసేయంత్రాన్ని అందజేయాల్సిందిగా ఆంజనేయులకు విన్నవించారు. తక్షణమే మంచి కంపెనీ యంత్రం అందించడంతో రెండేళ్లుగా ఇక్కడ పరీక్షలు చేయించుకుంటున్నారు.

మండపం చాలా బాగుంది..



నాది పక్కనే ఉన్న చెన్నుపల్లి గ్రామం . నాలుగు సంవత్సరాల క్రితం నా కుమార్తె చిన్మయి వివాహం ఇక్కడ చేశాను. పూర్తి వసతులతో మండపం చాలా బాగా ఉంది. నిర్వాహకులు నా వద్ద పైసా సొమ్ము తీసుకోలేదు. ఇంటికి దగ్గరలో కావటం వలన ఇంట్లో చేసుకున్నట్లుగానే ఉంది.

– జీ పార్థసారథి, చెన్నుపల్లి

తండ్రి ఆశయ సాధనకై..



నా తండ్రివెంకట సుబ్బారావు మునసబుగా, వీఆర్వోగా ఈ ప్రాంతంలో మంచి పేరు ఉంది. ఆయన స్ఫూర్తితో రెండు దశాబ్దాలుగా కక్కెర ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్నాం. గ్రామంలోనే అందరికీ అందుబాటులో ఉంటున్నాను. గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలు ఇక్కడ శుభకార్యాలు నిర్వహించుకోవడం తనకు తృప్తి, ఆనందాన్ని ఇస్తోంది. మనం కూడా ఉన్న దాంట్లో ఇతరులకు సాయం చేయాలి.

– కక్కెర అంజనేయులు, ఫౌండేషన్, నిర్వాహకుడు

ప్రతిభ పరీక్షకు విద్యార్థుల హాజరు



ఇంకొల్లులో పరీక్షను ప్రారంభిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు



పంగులూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జే.పంగులూరు: విద్యోన్నతి ఫౌండేషన్ ప్రతిభ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యోన్నతి ఫౌండేషన్ ఆదివారం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పరీక్షలో మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 103 మంది హాజరైనట్లు పరీక్ష నిర్వహించిన రిటైర్డ్ హెడ్మాస్టర్ కే వీరాంజనేయులు, ఫౌండేషన్ డైరెక్టర్ బొడెంపూడి జయశంకర్ తెలిపారు. ముందుగా మండలంలోని 110 మంది రిజిస్టర్ చేయించుకున్నారని, వారిలో 103 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్ష రాసిన వారిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు ఎంపిక చేసి వారికి ఇంటర్ చదివే రెండు సంవత్సరాలు సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున ఫౌండేషన్ తరుపున ఇస్తారని తెలిపారు. ఇదే విధంగా ఇంకొల్లు, అద్దంకి మండలాల్లో కూడా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అక్కడ కూడా మండలానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి నగదు బహుమతి ఇస్తారని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు (చినగంజాం): విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆదివారం టెన్త్ విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షకు ప్రభుత్వ మరియు ఎయిడెడ్ పాఠశాలల నుంచి పదవ తరగతి విద్యార్థులు 73 మంది పేర్లు నమోదు చేసుకోగా 68 మంది హాజరయినట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు కరి కమలేశ్వరరావు తెలియజేశారు. ప పరీక్షకు ఇన్విజిలేటర్లుగా విశ్రాంత ఉపాధ్యాయులు గోరంట్ల హరి బాబు, ఆవుల హనుమంతరావు, జాగర్లమూడి ప్రభాకరరావులు వ్యవహరించారు. గోరంట్ల హరి బాబు ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించారు.

ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డిని కలిసిన నాయకులు



మధుసూదన్‌రెడ్డిని కలిసిన మండలాల కన్వీనర్‌లు

చినగంజాం: పర్చూరు నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ నూతన ఇన్‌చార్జిగా నియమితులైన గాదె మధుసూదన్‌రెడ్డిని నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్‌లు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో చినగంజాం, ఇంకొల్లు, పర్చూరు, మార్టూరు, కారంచేడు మండలాల పార్టీ కన్వీనర్‌లు మున్నం నాగేశ్వర రెడ్డి, బండారు ప్రభాకరరావు, కఠారి అప్పారావు, పఠాన్ కాలేషావలి, దండా చౌదరిలతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు, రామప్రసాద్, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

11 నుంచి మండలస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మార్టూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ద్రోణాదుల, కోలలపూడి గ్రామాల్లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలలపూడిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 11వ తేదీ మండల స్థాయి సీనియర్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలైన అభ్యర్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసుగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ. 300 చెల్లించి 97057 02377 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. పోటీలో మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జే. పంగులూరు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం మండలాల వారు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఇతర ప్రాంతాల వారికి ప్రవేశం లేదన్నారు.

13న ద్రోణాదుల గ్రామంలో..

ద్రోణాదుల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ డబుల్స్ పోటీలు ఈనెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు 45 ఏళ్లు పైబడిన వారు, 45 ఏళ్ల లోపు వారికి రెండు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పార. రెండు విభాగాల్లోను విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి వరుసగా రూ.8వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున మొత్తం ఆరు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. పోటీలో పాల్గొను అభ్యర్థులు ఎంట్రీ ఫీజు రూ.300 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. పోటీలలో పాల్గొనే అభ్యర్థులకు భోజనం , అల్పాహారం కమిటీ ఏర్పాటు చేస్తారని, ఆధార్ కార్డు తీసుకొని రావాలని వారు తెలిపారు. పోటీలలో పాల్గొనే అభ్యర్థులు మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం మండలాలకు చెందిన వారు మాత్రమే అయిఉండాలని వారు తెలిపారు. వివరాలకు 99595 76009 నంబర్‌లో సంప్రదించవచ్చని వారు తెలిపారు.

గంగమ్మతల్లికి ఆడపడుచుల పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



కారంచేడులో గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆడపడుచులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. వారి కోరికలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించాలని, పిల్లులు లేనివారు సంతానం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలమ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గడ్డివామి దగ్ధం



మంటల్లో కాలిపోతున్న గడ్డివాము

మేదరమెట్ల: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. కొరిశపాడు మండలం రావినూతల ఎస్సీ కాలనీకి చెందిన పీ.చినఅంజమ్మకు చెందిన రెండు ఎకరాల గడ్డివామి ఆదివారం మంటల్లో కాలిపోయింది. ప్రమాదవశాత్తు గడ్డివామికి మంటలు వ్యాపించడంతో ఇరుగుపొరుగు అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలార్పినప్పటికీ గడ్డి పూర్తిగా మంటల్లో కాలిపోయిందని బాధితురాలు అంజమ్మ తెలియచేశారు. కాలిపోయిన గడ్డి విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. లైబ్రేరియన్ కథలు, జాతీయ నాయకుల చరిత్ర పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

10న విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

అద్దంకి రూరల్/చీరాల అర్బన్: రాష్ట్ర మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డివిజన్, అద్దంకి డివిజన్ కార్యాలయంలో ఈనెల 10న విడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ సమస్యలపై ప్రజాప్రాయసేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చీరాల విద్యుత్ ఈఈ కె.జాన్ థామస్, ఈఈ ఎస్ మస్తాన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఈ నెల 7,8, 10వ తేదీ విజయవాడ బృందావన్ కాలనీలో ఏ కన్వెన్షన్ సెంటర్‌లో, కర్నూలు పీఈఆర్‌సీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అద్దంకి డివిజన్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచినవారు. అద్దంకి డివిజన్ కార్యాలయంలో పేరు ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అభిప్రాయాలు తెలపాలని కోరారు.

హైందవ శంఖారావానికి వెళ్లిన చీరాల వాసులు



చీరాల నుంచి బయలుదేరిన ప్రజలు



చీరాల కొట్లబజారు నుంచి విజయవాడకు ఏర్పాటు చేసిన బస్సులు

చీరాల అర్బన్: విజయవాడలోని కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల నుంచి వేల సంఖ్యలో తరలి వెళ్లారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న హైందవ శంఖారావం సభకు చీరాల నియోజకవర్గం నుంచి 50 బస్సులలో మూడు వేల మంది తరలివెళ్లారు. చీరాల కొట్లబజారులోని రామమందిరం వద్ద నుంచి బస్సులు ఏర్పాటు చేశారు. సభకు మద్దతుగా శుక్రవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

నాగిరెడ్డికి జాతీయ కళారత్న అవార్డు



నాగిరెడ్డికి కళారత్న అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

కారంచేడు: తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ విజయవాడ వారిచే ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం మండలంలోని యర్రంవారి పాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మన్నంగి నాగిరెడ్డిని కళారత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు. నాగిరెడ్డికి జాతీయ సంక్రాంతి కళారత్నతో సత్కరించడం ఎంతో సంతోషంగా ఉండని నిర్వాహకులు తెలిపారు. సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ యూవీ రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ సేవా సొసైటీ ద్వారా నాగిరెడ్డి అందించిన అనేక సేవలను వారు కొనియాడారు. ముఖ్య అతిథులుగా విశ్వహిందు పరిషత్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవాచారి నిర్వాహకులు పాల్గొన్నారు.

సమష్టితో ఆక్వారంగ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రామయ్య

వేటపాలెం: స్ట్రయిట్ కట్ కుందేరు ప్రాంతంలో అక్వాసాగు చేసే రైతులు సమష్టిగా ఉండి అభివృద్ధికి కృషిచేయాల్సిన అవసరం ఉందని స్ట్రయిట్ కట్ రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తేళ్ల రామయ్య పేర్కొన్నారు. రామన్నపేట నాయినపల్లి ఎత్తిపోతల పథకం వద్ద గల రొయ్యరైతుల సంక్షేమ సంఘం సమావేశం హాల్లో స్ట్రయిట్ కట్ రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ గడిచిన ఆరేళ్లుగా ఆక్వాసాగు రైతులను నష్టాలు పాలు చేసిందన్నారు. దీన్ని అధిగమించాలంటే రైతులందరూ ఏకమై సమష్టి నిర్ణయాలతో ఆక్వాసాగును లాభాలబాట పట్టించుకోవడానికి కృషిచేయాలన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆక్వా సాగుకు పూర్వ వైభం రావలంటే రైతులందరురూ కలసి రొయ్యల చెరువుల పాంతాన్ని అన్ని విధలా అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఆమంచి శ్రీనివాసరావు, పల్లపోలు శ్రీనివాసరావు, భాస్కరరెడ్డి, అక్వా రైతులు పాల్గొన్నారు.